"నాన్నగారూ! నా కేమీ తోచడం లేదండీ!" అంది కమల.

వుదయమే కాఫీ తాగి పేపరు చదువుకుంటూన్న పరంధామయ్య కళ్ళజోడు లోంచి ఆప్యాంగా చూశాడు కూతురుకేసి.

"తోచకపోతే యే రామాయణమో, భారతమో చదువుకోరాదూ!" అంది, అప్పుడే హాల్లోకి వచ్చిన పరంధామయ్య భార్య కాంతమ్మ.

తండ్రీ, కూతు ళ్ళిద్దరూ ఒక్కసారి ఆమెకేసి చూసి, మళ్ళీ తమలో తాము చూసుకొని నవ్వుకున్నారు. "మీ అమ్మ యిష్టపడలేదుగాని, లేకపోతే నిన్ను కాలేజీలో చేర్పించేవాడినే." అని ఓదార్చాడు తండ్రి. "చూడు కమలా! ఈరోజు పేపర్లో యెడ్వర్టైజ్మెంటు పడింది. పెన్ ఫ్రెండ్స్ లిస్టులు సప్లయి చేసే యేజన్సీవాళ్ళు ప్రకటించారు. నీ కంతగా తోచకపోతే కాలక్షేపానికి "పెన్ ఫ్రెండ్స్" హాబీ అలవరుచుకోవచ్చు. వాళ్ళకి రాస్తే, లిస్టులు పంపుతారు. అందులో యేదోపేరు యెంచుకొని వుత్తర ప్రత్యుత్తరాలు మొదలు పెడితే కావలసినంత కాలక్షేపం అవుతుంది. అది మంచి యెడ్యుకేటివ్ హాబీ కూడా ను," అని సలహా యిచ్చాడు పరంధామయ్య.

కమల చాలా వుత్సాహపడింది తండ్రి యిచ్చినసలహా విన్నతరువాత. వెంటనే యేజన్సీకి రాసింది. తిరుగుటపాలో వాళ్ల దగ్గర్నుంచి పెద్దలిస్టు వచ్చింది.

ఆ రోజంతా 'కలంస్నేతుల' జాబితా గాలిస్తూ గడిపింది కమల. అందులో అనేకమంది స్త్రీ పురుషుల యెడ్రస్లు వున్నాయి.

ఇంతకీ యెవరికి రాయడం? స్త్రీకా? పురుషుడికా?

నాన్నగా రిచ్చిన సలహాలో తనను స్త్రీలకు మాత్రమే రాయాలని నిబంధన చేయలేదు. మగవాళ్ళకి రాయడంలో ఒకవిధమైన సరదా, కొత్తదనం, వుత్సాహమూ వుంటాయి. స్త్రీ స్నేహితులైతే తనకు తెలిసిన విషయాలు తాను తెలుసుకున్న విధంగానే రాస్తారు. అందులో కొత్తదనం యేముంటుంది?

ఆ జాబితా అంతా అనేకసార్లు తిరగవేసి చివరికి ఒకపేరు యెంచుకొంది అతడి పేరు మాధవరావు. హైదరాబాదులో వుద్యోగం. సంగీతము, సాహిత్యము ఆయన అభిమానవిషయాలు.

ఆరోజు మొదటి వుత్తరాన్ని రాయడానికి సంకల్పించింది కమల. తీరా రాయడానికి కూర్చుంటే యెలా ప్రారంభించాలో తెలియలేదు. అపరిచితమైన వ్యక్తికి వుత్తరం రాయడం! అందులో మగవాళ్ళకి వుత్తరం రాయడం! యెంత యిబ్బంది? సంబోధన దగ్గర్నుండీ సమస్యే!

* * *

# పరాజిత

'శాంతాజీ'




"శ్రీ మాధవరావు గార్కి,

నమస్కారాలు, మీతో పరిచయం లేకపోయినా మీ కీ వుత్తరం రాయడానికి సాహసించినందుకు క్షమించాలి. "పెన్ ఫ్రెండ్స్" జాబితాలో మీ పేరు చూసి యిలా రాయడం జరుగుతూంది.

మి మ్మల్ని 'కలం స్నేహితులు'గా యెందుకు యెంచుకున్నానా అని మీకు సందేహమా? మీ పేరులోనే నా కేదో ఆకర్షణ కనిపించింది. అదీగాక, పురాణాల్లోని అన్నిపాత్రలకంటె కృష్ణుడు అంటే నా కెంతో అభిమానం. ఆ మాధవుడి పేరులోనే అంత ఆకర్షణ వుంది. పైగా సంగీతంలోనూ, సాహిత్యంలోనూ మీకు అభిరుచి. నేనుకూడా అభిమానించేవి అవే. సంగీతం అంటే నేను చెవి కోసుకొంటాను.

మీ కింకా ఎన్నో విషయాలు వ్రాయాలని వుంది. మీ కిలా వుత్తరం రాయడానికి సాహసించినందుకు మన్నిస్తారని తలుస్తాను. మీ వుత్తరం కోసం ఎదురు చూస్తూ వుంటా.

మీ స్నేహాభిలాషి
కమల."

ఈ వుత్తరం రాయడానికి ఒకపూట పట్టింది కమలకి. కవరు జాగ్రత్తగా అంటించి, అప్పుడే వీధిని పోతున్న పోస్టుమన్ వీరాస్వామిని పిలిచి మరీ యిచ్చింది పోస్టు చెయ్యమని.

"చూడు వీరాస్వామీ! యీ ఉత్తరము జాగ్రతగా పోస్టు చెస్తావుకదూ? పిల్ల లెవరికయినా యిస్తే సరిగా పోస్టు చెయ్యరేమో నని నీ కిస్తున్నాను," అంది.


చిరునవ్వుతో ఆ వుత్తరం తీసుకున్నాడు వీరాస్వామి. అతడికీ కొంచెం తెలుసు — యీ వారం రోజులనుండీ కమల పడుతున్న తాపత్రయం, కలం స్నేహితుల జాబితాకోసం ఆమె ఆదుర్దాగా యెదురుచూడటం వగైరాలు.

పోస్టుమాన్ వీరాస్వామి ఆ వీధిలోనే పరంధామయ్యగారి యింటికి దగ్గర్లోనే కాపురం వుంటున్నాడు. కమలా, వీరాస్వామీ చిన్నతనంలో ఒకే వీధిబడిలో చదువుకున్నారు. వీరాస్వామి చదువులో చాలా చురుకుగా వుండేవాడు. ఫస్టు మార్కులన్నీ అతడివే. అతడు స్కూలుఫైనల్ పాస్ కాకుండానే తండ్రి హఠాత్తుగా చనిపోవడంవల్ల చదువు మానేసి వుద్యోగంలో చేరవలసివచ్చింది.

కమల పరికిణీలు మానేసి వోణీలు వేసుకునేవరకూ వాళ్ళింటికి వెళుతూనే వుండేది. పెద్ద దయినతర్వాత వాళ్ళ అమ్మ బలవంతంమీద పక్క ఇళ్ళకు తిరగడం మానేసింది. వీరాస్వామి చిన్నప్పటినుండీ వాళ్ళింట్లో చనువుగా తిరుగుతూ వుండేవాడు. వుద్యోగంలో చేరింతర్వాతకూడా తీరిక సమయాల్లో కాంతమ్మగారితో కుటుంబ వ్యవహారాలు మాట్లాడుతూ వుంటాడు.

నలుపైనా కళ గల ముఖం వీరాస్వామిది. అతడ్ని యెప్పుడు చూసినా అతని 'రోమన్' ముక్కుమీదే కమల దృష్టి పడుతూండేది. ఆ ముక్కు చాలా అందంగా వుంటుందని ఆమె అనుకుంటూవుండేది.

* * *



వుత్తరం రాసిన మర్నాటినుండే జవాబుకోసం యెదురుచూస్తూ కూర్చుంది కమల. నాలుగు రోజులకి ఉత్తరం రానే వచ్చింది. వీరాస్వామి జాగ్రత్తగా తీసుకొచ్చి కమలకే ఇచ్చాడు. అతని శ్రద్ధకి ఆమె యెంతో సంతోషించింది.

''నాకు వచ్చిన వుత్తరాలు నాకే యిస్తూవుండు. యింకెవ్వరికీ ఇవ్వొద్దు,'' అంది వుత్తరం తీసుకుంటూ.

కవరు చింపకుండా యెన్నోసార్లు ఆ వుత్తరాన్ని అటూయిటూ తిరగేసింది.

పరాయి మగవాడినుండి తనకు వుత్తరం రావడం యిదే మొదటిసారి తన జీవితంలో.

బరువుగా చింపింది కవరు.

''కుమారి కమలగారికి, నమస్సులు.''

'అబ్బ! యెంత మర్యాద! యెంత వినయం!' అనుకుంది తనలో.

"తలవని తలంపుగా ఒక అపరిచిత యువతి దగ్గర్నుండి యింత అప్యాయమైన వుత్తరం రాగానే నేను సంతోషంతో వుబ్బి తబ్బిబ్బు అయానంటే నమ్మండి."

'యెంత చమత్కారం! యెంతటి హృదయం! నేనంత చక్కటి వుత్తరము రాశానా?' అనుకుంది.

"యీ 'కలం స్నేహం' ద్వారా పరిచయం కలగడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మీలాంటి చదువూ, సంస్కారం కలిగిన స్నేహితురాలు నన్ను వెదుక్కుంటూ వచ్చిందంటే నన్ను నేనే నమ్మలేకుండా వున్నాను. మీ స్నేహాన్ని పదిలపర్చుకొని యింతోధికం చేసుకోవాలని యెంతో అభిలషిస్తున్నాను. వెంటనే వుత్తరం రాస్తారు కదూ?

మీ స్నేహాభిలాషి
మాధవరావు."

ఆ వుత్తరాన్ని యెన్నిసార్లు చదివిందో ఆమెకే గుర్తులేదు. ఆ రోజంతా ఒక కలలా గడిచిపోయింది కమలకి.

మర్నాడు రోజంతా కూర్చుని, రాసిందే పదిసార్లు రాసి, ఆఖరుకి ఒక పెద్ద వుత్తరం తయారుచేసింది. పోస్టుమాన్ కోసం యెదురు చూసి, పోస్టు చెయ్యమని అతని కిచ్చింది.

నాల్గురోజుల్లో తిరిగి జవాబు వచ్చింది.

"కుమారి కమలగార్కి,

వుద్యోగపు గానుగలో పడి యెండిపోయి బీటలువారిన నా హృదయానికి మీ ఉత్తరం ఒక వానజల్లు. మీ స్నేహం నా కనేక ద్వారాలు తెరిచింది. లోకంలో యింత సహృదయులు, స్నేహపాత్రులు వుంటారని నే నూహించలేదు. మన స్నేహలతను పెంపొందించుకొని పుష్పాలూ, కాయలూ కాసేలాగ ప్రాణప్రదంగా పెంచుకోవాలని నా అభిలాష.

మీరు చదివిన పుస్తకాలు సాహితీ ప్రపంచంలో ప్రసిద్ధమైనవే. ఇంత చిన్నతనంలోనే అంత సాహితీ పరిజ్ఞానం యెలా అలవర్చుకున్నారా అని ఆశ్చర్యంగా వుంది. ఇక మీ సంగీత పరిజ్ఞానం యెంత వున్నతస్థాయిలో వుంటుందో నని వూహించుకుంటున్నాను.

వీటి అన్నిటివెనకా, అప్పుడప్పుడూ వుత్తరాల్లో ద్యోతకమవుతూన్న మీ అమాయకత్వం, ముగ్ధత్వం నన్ను ముగ్గుణ్ణి చేస్తున్నాయి.

"మీ వుత్తరం రావడం ఆలస్యమైతే నా మనస్సు గిలగిలా కొట్టుకుంటుంది. వెంటనే వుత్తరం రాస్తారు కదూ?

మీ స్నేహాభిలాషి
మాధవరావు."

ఆ వుత్తరానికి వెంటనే జవాబు రాసింది కమల. ఇలా వారిద్దరిమధ్యా అనేక వుత్తరాలు నడిచేయి. కలం పరిచయం క్రమంగా అనురాగలతను పెంచుకుంది.

ఒక వుత్తరంలో మాధవరావుని ఫోటో పంపమని రాసింది. కొద్దిరోజుల్లో అతని దగ్గర్నుండి వుత్తరం వచ్చింది.

"డియర్ కమలా!

నీ వుత్తరం నన్ను మేఘాల్లోకి తీసుకుపోయింది. ప్రతి అక్షరంలోనూ నీ మూర్తి తొంగిచూసి నాతో దోబూచులాడుతోంది. ఫోటో పంపమని రాశావు. నా ఫోటోను కాకుండా నన్నే నువ్వు ప్రధమంగా చూడాలని నా కోరిక...... ఇంతకీ నీ ఫోటో పంపమని నేను వ్రాయలేదేమా అని నువ్వు ఆశ్చర్య పోతున్నావు కదూ?... యీ లోకంలో అందాలన్నీ తమలో యిముడ్చుకున్న నీ విశాల నేత్రాలూ, లక్క పిడతలాంటి నీ చిన్ని నోరూ, నల్లటి మబ్బుల్ని దాచుకున్న నీ నీల శిరోజాలూ—యివన్నీ దూరంగా వుండి చూస్తూనేవున్నాను!"

కమల ఆశ్చర్య పడింది. యిదేమిటి చెప్మా! తన నెప్పుడో చూసినట్టే రాస్తున్నాడు. అతని వూహాశక్తికి జోహారు లర్పించింది.

"నేను కొద్దిరోజులు వూళ్ళో వుండను. మళ్ళీ నా దగ్గర్నుంచి వుత్తరం వచ్చే వరకూ జాబు రాయవద్దు.

మీ మాధవరావు."

వుత్తరాలకి అంతరాయం వచ్చినందుకు కమల నిరుత్సాహ పడింది. ఏవూరు వెళ్తున్నాడో, ఎన్నాళ్ళవరకూ తిరిగిరాడో అని దిగులుపడింది.

* * *

పరంధామయ్యగారు వూళ్ళో లేరు. వుదయం వచ్చిన పేపరు చదువుతూ కమల హాల్లో కూర్చునుంది. వీరాస్వామి చెల్లెలు గిరిజ హాల్లోకి వచ్చి నిలబడింది.

"ఏం, యిలా వచ్చావు?" అంది కమల

"మా అన్నయ్యకి సుస్తీగా వున్నదండీ వారం రోజులనుండీ లేవడం లేదు. మా అమ్మ పదిరూపాయ లుంటే అడిగి తీసుకురమ్మంది"

కమలకి చటుకున జ్ఞాపకం వచ్చింది. యీమధ్య వీరాస్వామి పోస్టు తేవడం లేదని ఎవరో మరొకతను వుత్తరాలు అందిస్తున్నాడు.

ఇంతలో కాంతమ్మ హాల్లోకి వచ్చింది.

"అమ్మా! వీరాస్వామికి జబ్బుగా వుంటే పదిరూపాయి లుంటే ఇమ్మని వాళ్ళ అమ్మ కబురుచేసింది.

వీరాస్వామి అన్నా, వాళ్ళ కుటుంబం అన్నా కాంతమ్మకి అభిమానమే. వెంటనే పదిరూపాలిచ్చి పంపించింది.

కుర్చీలో కూర్చునివున్న కమలకి ఏవేవో ఆలోచనలు వచ్చాయి వీరాస్వామి గురించి. అవును పాపం! అతనికి సుస్తీగా వుందని తెలిస్తేగాని అతడు రావడం లేదనే విషయం తనకి గుర్తుకి రాలేదు

ఎందుకో, వీరాస్వామిని ఒకసారి వెళ్ళిచూడా లనిపించింది కమలకి. ఇంతలో తనకి కలిగిన ఆలోచనకి తనే

ఆశ్చర్యపడింది. అతని గురించి తను అంతగా యిదవడం యెందుకు? పైగా, తన అంతస్తు ఎక్కడా, వాళ్ళ అంతస్తు ఎక్కడా?

అయితే, చిన్నప్పుడు కలిసి చదువుకున్న అంతర్గత సహచర్యమే అతనిని యిపుడు చూడాలనే ఆలోచన కలిగించింది అని సమర్థించుకుంది.

ఆ సాయంత్రమే ఒక్కతే వెళ్ళింది వీరాస్వామి యింటికి. కమలని చూడగానే వీరాస్వామి తల్లి సూరమ్మ ఆశ్చర్యపోయింది–పెద్దింటి అమ్మాయి స్వయంగా వచ్చిందే అని

"ఎలా వుంది సూరమ్మా, వీరాస్వామికి? పాపం, వారం రోజుల్నుంచీ సుస్తీగా వుందట?" అని పలకరించింది.

వీరాస్వామి ముందరి వసారాలో మంచంమీద పడుకొనివున్నాడు. కమలని చూడగానే తళుకుపోయిన అతని కళ్లు కృతజ్ఞతతో మెరిశాయి. నీరసంగా ఆమెకి నమస్కరించాడు.

ఎంతో చురుకుగా, సరదాగా తిరిగే వీరాస్వామేనా యీ నాల్గురోజుల్లో ఇలా అయిపోయాడు. అదేం జబ్బో, మనిషిని అంత నీరసం చేసింది.

తనకి కలిగిన సానుభూతిని యెలా వ్యక్తం చెయ్యాలో సరిగా తెలియక తికమక పడుతూంది కమల.

"కూర్చోండి అమ్మాయిగారూ! ఏదో మామీద అభిమానం వుండబట్టి యిలా వచ్చారు మావాడ్ని చూడ్డానికి. రెండు రోజుల్నుండీ, మరీ యెక్కువగా వుంది. ఒకటే వాంతులూ. అయ్యా సమూనమ్మా! ఆచార్యులుగారు, చెయ్యి చూసి యిది ప్రమాదమైంది, జాగ్రత్తగా వుండాలని చెప్పి పొట్లాలిచ్చి పోయాడమ్మా! అదేమి జబ్బో మరి! నాకు దిగులుతో గుండెలు జారిపోయి యిందాకటినుండీ ఆ మందుకూడా పట్టించలేదు," అంటూ వాపోయింది సూరమ్మ.

ఆపదలో వున్న ఆ కుటుంబానికి ఏదో విధంగా సహాయపడాలని తాపత్రయం కమలకి.

"మందు లివ్వడం అశ్రద్ధ చేస్తే ఎలాగ? యేవీ ఆ పొట్లాలు – యెక్కడున్నాయి?" అంది కమల.

"అదుగోనమ్మా. ఆ డ్రాయరులోనే వున్నాయి," అంటూ వసారాకి అనుకొని వున్న గదిలో డ్రాయరు చూపించింది సూరమ్మ.

కమల హడావిడిగా డ్రాయరు లాగింది. నాలుగు మందుపొట్లాలు... పొట్లాలపక్కనే చిన్న వుత్తరాలకట్ట... ఆ కవర్లమీది దస్తూరీ తనకు పరిచయంగా వుంది... 'అరే! యిదేమిటీ? తన దస్తూరే!'

చటుక్కున కట్ట విప్పి చూసింది. ఆ వుత్తరాలన్నీ తాను మాధవరావుగారికి రాసిన వుత్తరాలు!

కమల తికమక పడిపోయింది



కాన్సేపు! మరుక్షణంలో అర్థమైంది.. మాధవరావు పేరుతో తనకిన్నాళ్ళూ వుత్తరాలు రాస్తున్నది యీ వీరస్వామే! యెంత మోసం! యెంత ధైర్యం!

మరుక్షణంలో, వుత్తరాల్లో వీరాస్వామి తనమీద చూపిన అభిమానం, అనురాగం ఒక్కసారి జ్ఞప్తికివచ్చాయి. ఆమెమనస్సు అతన్ని ద్వేషించాలో, అభిమానించాలో నిర్ధారించుకోలేక తికమక పడింది.

"కమలగారూ!" అని నీరసంగా మంచంలోనుండి పిలుపు వినబడింది.

కొయ్యబారిపోయిన కమల వులిక్కిపడింది పక్కగదిలో. ఈ లోకంలోని దైన్యం అంతా ప్రతిధ్వనించింది ఆ పిలుపులో.

మెల్లగా, బరువుగా వీరాస్వామి మంచందగ్గర కొచ్చింది కమల.

నీరసించి, అగాధాల్లోకి పోయిన అతని కళ్ళల్లోని దైన్యం ఆమె ఆలోచనల్ని అరికట్టింది.

——